

నిద్ర కరువైతే అనారోగ్యం..!
మానవుని జీవనశైలిలో మార్పులు, అధికంగా మొబైల్ వాడడం, టీవీ ఎక్కువగా చూడడం వల్ల అధికశాతం మంది నిద్రలేమి బారిన పడుతున్నారు. -8లో



ఆకతాయిల ఆట కట్టించేందుకు 'శక్తి' టీమ్స్ -8లో
ఆకతాయిల ఆట కట్టించేందుకు 'శక్తి' టీమ్స్‌ను ఏర్పాటు చేశామని ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శుక్ర (సా)	శని (ఉ)
6.09	4.56

న్యూస్‌రీల్

పీఓ దృష్టికి ఆదివాసీల సమస్య



ఆదివాసీల ఇళ్లనిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ అప్పారావు

భామిని: ఐటీడీఏ పీఓ దృష్టికి ఆదివాసీల భూమి, ఇళ్ల సమస్యను తీసుకెళ్తానని భామిని తహసీల్దార్ నీలాపు అప్పారావు తెలిపారు. ఏకలవ్య పాఠశాల భవన నిర్మాణాల కోసం 2018 సంవత్సరంలో సుమారు 36 ఎకరాల సాగు భూమిని ఆదివాసీలు ప్రభుత్వానికి అప్పగించారు. దీనికి ప్రత్యామ్నాయంగా ఎకరా భూమి, 10 సెంట్లు ఇంటి స్థలం ఇచ్చేందుకు అప్పటి పీఓ శివశంకర్ సమక్షంలో ఒప్పందం కుదిరింది. ఆ తర్వాత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఎలాంటి స్థలం కేటాయించకుండా ఇటీవల పాఠశాల స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి పూనుకోవడంతో ఆదివాసీలు ఆందోళనకు దిగారు. పాఠశాల స్థలంలో పూరిళ్ల నిర్మాణాన్ని తలపెట్టారు. ఇదే అంశంపై 'పాఠశాల స్థలంలో పూరిళ్లు' శీర్షికన సాక్షిలో వచ్చిన వార్తకు రెవెన్యూ అధికారులు స్పందించారు. ఆదివాసీలు పూరిళ్లు వేస్తున్న స్థలాన్ని తహసీల్దార్ పరిశీలించారు. సమస్య పరిష్కారానికి కృషిచేస్తామన్నారు.

మొల్ల రచనలు ఆదర్శనీయం



కవయిత్రి మొల్లమాంబ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: కవయిత్రి మొల్లమాంబ రచనలు అందరికీ ఆదర్శనీయమని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. వాల్మీకి రామాయణాన్ని పామరులకు సైతం అర్థమయ్యేలా తెలుగు భాషలోకి అనువదించిన తొలి తెలుగు కవయిత్రి మొల్ల అని గుర్తుచేశారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం మొల్లమాంబ జయంతిని నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి కలెక్టర్ పూలమాలను వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి మహర్షి రామాయణాన్ని సంస్కృత భాషలో 24 వేల పద్యాలుగా రచిస్తే, దానిని 671 పద్యాలుగా అందరికీ అర్థమయ్యేలా సరళమైన తెలుగు భాషలో రచించిన ఘనత ఆమెదని కొనియాడారు. కార్యక్రమంలో పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి, డీఆర్వో కె.హేమలత, కేఆర్ఆర్‌సీ ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారి ఎస్.కృష్ణ, జిల్లా శాలివాహన సంఘ అధ్యక్షుడు కొత్తూరు శంకరరావు, కార్యదర్శి ఉరిటి యాదవ్, తెప్పల శ్రీను, ఉరిటి సింహాచలం, ఉరిటి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ పురంలోనే ఏనుగులు



బాసంగి-గడబవలస, వెంకటరాజపురం పంట పొలాల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురం గ్రామంలోనే ఏనుగులు మూడు రోజులుగా తిష్టవేశాయి. వరి, జొన్న పంటలను ధ్వంసం చేయడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఏనుగులను తరలించే చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

15 పశువుల పట్టివేత

పార్వతీపురం రూరల్: పార్వతీపురం మండలంలోని నర్సిపురం వద్ద కబేళాలకు రెండు బొలెరో వాహనాల్లో తరలిస్తున్న 15 పశువులను గురువారం స్వాధీనం చేసుకుని గోసంరక్షణశాలకు తరలించినట్లు పార్వతీపురం రూరల్ ఎస్‌ఐ బి.సంతోషి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నర్సిపురం సమీపంలో మానాపురం సంతకు తరలిస్తుండగా మార్గం మధ్యలో రెండు బొలెరో వాహనాల్లో తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వాహనాలను సీజ్ చేసినట్లు ఆమె తెలిపారు.

77 జీఓ రద్దుకు డిమాండ్

విజయనగరం గంటస్తంభం: జీవో నంబర్ 77 రద్దుచేసి పీజీ విద్యార్థులకు న్యాయం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పూడి రామ్మోహన్ డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ విజయనగరం డిగ్రీ కళాశాల విద్యార్థులు మయూరి కూడలి నుంచి కాంప్లెక్స్ వరకు గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. కాంప్లెక్స్ వద్ద రాస్తారోకో చేపట్టారు. తక్షణమే రూ.3,680 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



విజయీభవ!

పదోతరగతి పరీక్షలను చక్కగారాసి ఫలితాల్లో రాష్ట్రంలోనే పార్వతీపురం మన్యం జిల్లాను మొదటి స్థానం నిలపాలని కలెక్టర్ ఏ. శ్యామ్‌ప్రసాద్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. పార్వతీపురం డీవీఎం ప్రభుత్వ పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలను కలెక్టర్ గురువారం సందర్శించారు. కష్టపడకుండా ఇష్టపడి చదవాలన్నారు. ఒత్తిడికి గురికాకుండా, శ్రద్ధతో, ఆత్మస్థైర్యంతో పరీక్ష రాసి అధిక మార్కులు సాధించాలన్నారు. అందరూ ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు పెన్ను, ప్లాంక్, వివేకానందుని ఫొటోను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి డా.తిరుపతినాయుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

- పార్వతీపురంటౌన్

పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో బుధవారం చేపట్టిన యువత పోరులో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నేతలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు



యువత పోరు విజయవంతం



హోరెత్తిన నిరసన ర్యాలీ

సాక్షి, పార్వతీపురం మన్యం: కూటమి ప్రభుత్వ పాలనలో దగా పడిన విద్యార్థులు, నిరుద్యోగ యువత తరఫున వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు జిల్లాలో చేపట్టిన యువత పోరు కార్యక్రమం విజయవంతమైంది. జిల్లాలోని నాలుగు నియోజక వర్గాల నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, నిరుద్యోగులు, వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, అభిమానులు తరలివచ్చారు. నినాదాలతో జిల్లా కేంద్రాన్ని హోరెత్తించారు. ప్రభుత్వ మోసపూరిత వాగ్దానాలను నమ్మి, తాము పడుతున్న అవస్థలను ఏకరువు పెట్టారు. కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులను ఉపయోగించి కూటమి ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేసినా.. నిరుద్యోగులంతా ఐక్యంగా తిప్పికొట్టారని, యువత పోరును విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, మాజీ డిప్యూటీ సీఎంలు పీడిక రాజన్న దొర, పాముల పుష్పశ్రీవాణి, మాజీ ఎమ్మెల్యేలు అలజంగి జోగారావు, విశ్వాసరాయి కళావతి గురువారం ఓ ప్రకటనలో పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

హైస్కూల్ మాస్టార్లే.. ఇన్విజిలేటర్లు

- పదోతరగతి ఇన్విజిలేషన్ బాధ్యతల నుంచి ఎస్జీటీలను తప్పించిన ప్రభుత్వం
- 436 మంది హైస్కూల్ ఉపాధ్యాయులకు బాధ్యతలు
- ఈనెల 17 నుంచి టెన్త్ పరీక్షలు
- పరీక్షకు హాజరుకానున్న 10,455 మంది విద్యార్థులు
- 67 కేంద్రాల్లో పరీక్ష నిర్వహణ



పదోతరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న వీరఘట్టం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

వీరఘట్టం: పదోతరగతి పబ్లిక్ పరీక్షల ఇన్విజిలేటర్లుగా ఈ ఏడాది హైస్కూల్ మాస్టార్లే కొనసాగనున్నారు. మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా గతంలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను (ఎస్జీటీలు) ఇన్విజిలేటర్లుగా నియమించేవారు. ఈ సారి ఆ బాధ్యతల నుంచి ఎస్జీటీలను కూటమి ప్రభుత్వం తప్పించింది. హైస్కూల్స్‌లో పనిచేసే సబ్జెక్టు టీచర్లు, భాషోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయకులకు ఇన్విజిలేషన్ బాధ్యతలను అప్పగించింది. మొదటి మూడు లాంగ్వేజీ పరీక్షలకు సబ్జెక్టు టీచర్లు ఇన్విజిలేషన్ విధులు నిర్వర్తిస్తారు. తర్వాత జరిగే సబ్జెక్టు పరీక్షలకు భాషోపాధ్యాయులు, ఇతర సబ్జెక్టు టీచర్లు ఇన్విజిలేషన్ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ నెల 17 నుంచి జిల్లాలోని 67 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల పర్యవేక్షణలో పరీక్షలు జరగగా ఈ ఏడాది పూర్తిగా పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలోనే పరీక్షలు జరగనున్నవి.

పరీక్షల నిర్వహణ ఇలా..

పార్వతీపురం మన్యం జిల్లాలోని 15 మండలాలకు చెందిన 10,455 మంది విద్యార్థులు ఈ ఏడాది పదోతరగతి పబ్లిక్ పరీక్షలు రాయనున్నారు. వీరిలో బాలికలు 5,339 మంది, బాలురు 5,116 మంది ఉన్నారు. పరీక్షల పర్యవేక్షణకు 67 మంది చొప్పున డిపార్ట్‌మెంట్, చీఫ్ సూపరెండెంట్ అధికారులను నియమించారు. 3 బృందాల చొప్పున ఫ్లైయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లు, 436 మంది హైస్కూల్ సిబ్బందిని ఇన్విజిలేటర్లుగా నియమించారు. 2023 టెన్త్ ఫలితాల్లో 87.47 శాతం, 2024 మార్చిలో జరిగిన టెన్త్ ఫలితాల్లో 96.37 శాతంతో పార్వతీపురం మన్యం జిల్లా రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. ముచ్చటగా మూడోసారి ఫలితాల్లో ముందంజలో నిలిచేందుకు విద్యాశాఖ చదువు ప్రణాళికను అమలుచేసింది. పరీక్షల ఆరంభం వరకు ప్రత్యేక తరగతుల్లో బోధన సాగిస్తోంది.



వీరఘట్టం మండలం బీటీ వాడలో టెన్త్ పరీక్షలకు సిద్ధం చేసిన తరగతి గది

సీ సెంటర్లపై నిఘా...

జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు జరుగుతున్న 67 కేంద్రాలను ఏబీసీ కేటగిరీలుగా విభజించారు. ఇందులో ఏ-కేటగిరీ 21, బి-కేటగిరీ 24, సీ-కేటగిరీ 22 కేంద్రాలు ఉన్నాయి. సీ-కేటగిరీ కేంద్రాలు పార్వతీపురం డివిజన్‌లో 9, పాలకొండ డివిజన్‌లో 13 ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో నిఘా ఏర్పాట్లు పక్కాగా చేశారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



గతేడాది కంటే ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను సన్నద్ధంచేశాం. 67 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా రాసేందుకు అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేశాం. ఈ ఏడాది హైస్కూల్స్‌లో పనిచేస్తున్న 436 మంది భాషోపాధ్యాయులు, సబ్జెక్టు టీచర్లు, వ్యాయామ ఉపాధ్యాయులకు ఇన్విజిలేషన్ బాధ్యతలు అప్పగించాం. హైస్కూల్ సిబ్బంది కొరత ఉన్నచోట ఎస్జీటీలను కూడా తీసుకున్నాం.

– ఎస్.తిరుపతినాయుడు, జిల్లా విద్యాశాఖాధికారి, పార్వతీపురం మన్యం జిల్లా

కురుపాంలో ఆహార తనిఖీలు



కురుపాం అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు తనిఖీ చేస్తున్న రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు కాంతారావు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలో రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు బి.కాంతారావు గురువారం పర్యటించారు. ముందుగా కురుపాం ఎంపీపీ స్కూల్ ఆవరణలో మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ వాహనం ద్వారా అందిస్తున్న నిత్యావసర సరుకుల పంపిణీ తీరును పరిశీలించారు. సరుకుల కొలతలను తనిఖీ చేశారు. అక్కడే ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి కోడి గుడ్ల నిల్వలు, రికార్డుల నిర్వహణ, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. జీసీసీ ఆధ్వర్యంలోని ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్‌ను సందర్శించి కందిపప్పు, బియ్యం, పంచదార, పామాయిల్ తదితర సరుకుల నిల్వలు, రిజిస్టర్ల నిర్వహణపై ఆరా తీశారు. కురుపాంలోని ఏపీ మోడల్ స్కూల్‌ను సందర్శించి మధ్యాహ్న భోజన వంటకాలను రుచి చూశారు. ఆయన వెంట జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనివాసరావు, జీసీసీ డీఎం వి.మహేంద్రకుమార్, ఐసీడీఎస్ పీడీ టి.కనకదుర్గ, వైద్యారోగ్య శాఖ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ టి.జగన్ మోహన్‌రావు, ఆహార భద్రత అధికారి వై.రామయ్య, తూనికలు, కొలతల అధికారి కె.రత్నరాజు, తదితరులు ఉన్నారు.

ఆదుకోమంటే.. అరెస్టు చేస్తారా..?

- పోలీసుల తీరుపై మండిపడిన పెదగుడబ గ్రామస్తులు



యువకుడిని బలంతంగా ఎత్తుకెళ్తున్న పోలీసులు



పెదగుడబలో మోహరించిన పోలీసులు

గరుగుబిల్లి: ఆత్యం మైనింగ్ కంపెనీ వాహన రాకపోకలతో దుమ్ముధూళి రేగుతోందని, వ్యాధుల బారిన పడుతున్నామని, దీని నుంచి బయటపడే మార్గం చూపి ప్రాణాలు కాపాడాలని వేడుకుంటే అక్రమంగా అరెస్టు చేస్తారా అంటూ పెదగుడబ గ్రామస్తులు పోలీసులను ప్రశ్నించారు. అక్రమ అరెస్టులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. రోడ్డులో లారీల రాకపోకలను నిలువరించిన గ్రామస్తులకు రక్షణగా నిలవాల్సింది పోయి బుధవారం 15 మందిని, గురువారం మరో నలుగురు యువకులను అరెస్టుచేయడం దుర్మార్గమన్నారు. ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. పెదగుడబలోని ప్రజలను నిలువరించేందుకు చినమేరంగి సీఐ టి.వి.తిరుపతిరావు, ఎస్ఐ పి.రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో దాదాపు 40 మంది పోలీసులు గ్రామంలో మోహరించి ప్రజలను భయాందోళనకు గురిచేస్తూ యువకులను బలవంతంగా ఎత్తుకెళ్లి ఉద్రిక్త వాతావరణాన్ని సృష్టించారన్నారు. ప్రజల పక్షాన ఉండాల్సిన పోలీసులే గుత్తేదారులకు వత్తాసు పలుకుతూ అక్రమ అరెస్టులకు పాల్పడడం దారుణమన్నారు.

ఈ క్రమంలో గ్రామస్తులు నేరుగా ప్రజా సంఘాల నాయకులతో కలిసి కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్‌కు తమ గోడు వినిపించారు. తక్షణమే పోలీసులు అదుపులోకి తీసుకున్న గ్రామస్తులను విడుదల చేయాలని, క్వారీ పనులు నిలుపుదల చేయాలని విజ్ఞప్తిచేశారు.

కలిసికట్టుగా సారాపై సమరం

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లాను సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కలిసికట్టుగా ముందుకు సాగాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఎక్సైజ్ శాఖ అధికారులకు సూచించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నవోదయం 2.0 కార్యక్రమంపై గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం నవోదయం 2.0 ప్రచార రథం, పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లాలో 137 గ్రామాలను ఏ, బీ, సీ గ్రామాలుగా వర్గీకరించి దత్తత అధికారులను నియమించామన్నారు. సారా సంబంధిత ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్ 14405 పై విస్తృత ప్రచారం చేయాలన్నారు. 1,265 పాత నేర చరిత్ర కలిగిన వ్యక్తులను గుర్తించి, వారిలో 191 మందిని బైండోవర్ చేసిన విషయాన్ని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అంతర రాష్ట్ర సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేయాలని, పటిష్ట నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పార్వతీపురం మున్సిపాలిటీ ఇందిరా కాలనీలో నవోదయం 2.0 ప్రచార రథంతో అవగాహన కల్పించారు.

కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ, ఏఎస్పీ అంకిత సురానా, ఎక్సైజ్ ఏసీ పైడి రామచంద్రరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.శ్రీనాథుడు, ఏఈఎస్ జీవన్‌కిశోర్, డీఈఓ ఎస్.తిరుపతినాయుడు, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, ఎక్సైజ్ అధికారులు

23 నాటికి సర్వే పూర్తిచేయాలి

జిల్లాలో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాల సర్వేను ఈ నెల 23 నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ హౌసింగ్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 20 నాటికి తొలిదశ నిర్మాణాలు పూర్తిచేసిన వారి ఖాతాలకు 21న నగదు జమచేస్తామన్నారు.

15న స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం

జిల్లాలో ఈ నెల 15వ తేదీన ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తహసీల్దార్లకు సూచించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో రీసర్వే పక్కాగా నిర్వహించి వీలైనంత త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. రెవెన్యూ సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలన్నారు. సీబీజీ(కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్)కోసం ప్రతీ మండలంలో ఐదు వందల ఎకరాల వరకు ప్రభుత్వ స్థలం అవసరమని, అందుబాటులో ఉన్న మండలాల వివరాలను అందజేయాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో పీఓలతో పాటు డీఆర్వో కె.హేమలత, కెఆర్ఆర్ ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రంగుల వేడుక... కారాదు విషాద గీతిక

- నేడు హోలీ
- రంగులతో జరభద్రం



నగరంలో విక్రయానికి సిద్ధంగా ఉన్న రంగులు

విజయనగరం: హోలీ పండగ అంటేనే రంగులలో మునిగి తేలడం. పిల్లలు, యువత, మహిళలు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ రంగులు చల్లుకుంటూ ఆనందంగా గడుపుతారు. ఒక్క రంగు చల్లడంతో మొదలయ్యే హంగామా.. వింత వింత రంగులు పులుముకునే వరకు వెళ్తుంది. ఆనందం హద్దులు దాటుతున్న కొద్దీ.. హోలీ తీరు కూడా మారిపోతుంటుంది. సరిగ్గా ఇలాంటి సమయంలోనే ముందస్తుగా తగిన జాగ్రతలు తీసుకోకపోతే 'రంగుపడుద్ది' అని హెచ్చరిస్తున్నారు వైద్య నిపుణులు.

- హోలీ సందర్భంగా వినియోగించే కృత్రిమ సింథటిక్ రంగులు మనిషి శరీరంపై ప్రభావం చూపుతాయి. అంతేకాక ఈ రంగులు కళ్లల్లో పడితే కంటిచూపును కోల్పోయే ప్రమాదం ఉంటుందన్నది నేత్ర వైద్యుల మాట. రంగులు చల్లుకునే సమయంలో అత్యుత్సాహం ప్రదర్శించకుంటే హోలీ ఆనందహేళి అవుతుంది. రసాయన రంగులతో కాకుండా సహజ సిద్ధమైన రంగులతో హోలీ ఆడితే ఎలాంటి ఇబ్బందులు ఉండవు.
- రసాయనాలతో తయారు చేసిన రంగులు మనిషిపై పడితే చర్మ సంబంధిత వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. ప్రధానంగా లెడ్ ఆక్సైడ్, అల్యూమినియం, బ్రొమైడ్, మెర్క్యూరీ సల్ఫేట్ వంటి వాటిని కలిపి తయారు చేసే రంగులు చాలా ప్రమాదాన్ని కలిగిస్తాయి.
- రసాయనాలతో కలిపిన రంగులతో హోలీ ఆడితే శరీరంపై రంగులు ఎక్కువ సమయం ఉంచకుండా చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాలి.
- హోలీ సందర్భంగా ఎరుపు, పింక్ రంగులను వాడితే మంచిది. ఎందుకంటే ఈ రంగులు శరీరం నుంచి సులభంగా తొలగిపోతాయి.
- గ్రీన్, ఎల్లో, ఆరెంజ్ రంగులు ఎక్కువ రసాయనాలను కలిగి ఉంటాయి. ఆ రంగులు శరీరం నుంచి సులభంగా తొలగిపోవు.
- హోలీ ఆడటానికి ముందు శరీరానికి మాయిశ్చరైజర్ని, తలకు నూనె రాసుకోవాలి. ఇలా చేయడం వల్ల రంగులు శరీరంలోకి త్వరగా ఇంకవు. రంగులను శుభ్రం చేసుకోవడం సులభమవుతుంది.

చిన్నపిల్లలను రంగులకు దూరంగా ఉంచాలి

చాలా మంది సరదాకోసం హోలీ పండగ సందర్భంగా చిన్నపిల్లలకు కూడా రంగులు రాస్తారు. అయితే, చిన్నపిల్లల శరీరం లేతగా ఉండడం వల్ల రసాయనాలతో తయారు చేసిన రంగులు పిల్లల చర్మంపై వెంటనే ప్రభావం చూపుతాయి. ఇక కళ్లల్లో రంగులు పడితే ఆ ప్రభావం తీవ్రంగా ఉంటుంది. అందువల్ల పిల్లలను హోలీ సందర్భంగా రంగులకు దూరంగా ఉంచితే చాలా మంచిది.

– శ్రీనివాసరావు, చిన్న పిల్లల వైద్య నిపుణుడు

క్లుప్తంగా

ఊయల ప్రారంభం



ఊయల పథకాన్ని ప్రారంభిస్తున్న ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ

పార్వతీపురం: అనాథ పిల్లలను అక్కున చేర్చుకునేందుకు ప్రభుత్వం ఊయల పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిందని జిల్లా మహిళా శిశుసంక్షేమశాఖ పీడీ టి.కనకదుర్గ అన్నారు. ఈ మేరకు గురువారం బాలల సంరక్షణ కేంద్రంలో 'ఊయల' పథకాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను బయట పడవేయకుండా ఈ ఊయలలో వేయాలని, శిశువు పుట్టగానే కొంతమంది పిల్లలను పెంచుకోలేని స్థోమత లేని వారు కానీ, అలాగే పొదల్లో కానీ శిశువులను పడవేయకుండా ఊయల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనాథ పిల్లలను ప్రభుత్వం సంరక్షించి వారి ఆలనా, పాలనా చూస్తుందన్నారు. ఈ పిల్లలను కావాల్సిన వారికి ప్రభుత్వం దత్తత ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ, శిశుగృహ మేనేజర్ రమణమ్మ, సోషల్ వర్కర్ అల్లు రమ్య, ప్రసాదరావు, ఎంఏ నాయుడు, టి.శ్రీధర్ పాల్గొన్నారు.

వివేకానందుడే ఆదర్శం



వివేకానందుడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: మనందరికి వివేకానందుడే ఆదర్శప్రాయుడని, కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సంస్కృత ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వివేకానందుడి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ భారతదేశ గౌరవాన్ని, కీర్తిని, సంస్కృతిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన మహనీయుడు వివేకానందుని మార్గనిర్దేశకంలో పయనించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఈఓ తిరపతిరావు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ ఎం. శ్రీరాములు పాల్గొన్నారు.

అగ్నిగంగమ్మకు ప్రత్యేక పూజలు



ఊరేగిస్తున్న అమ్మవారి ఘటాలు

పార్వతీపురం రూరల్: ఆంధ్రా–ఒడిశా సరిహద్దుల్లో వెలసిన నీలావడి అగ్నిగంగమ్మకు ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్నారు. అగ్నిగంగమ్మ జాతరలో భాగంగా అమ్మవారి ఘటాలను గ్రామంలోని పలు వీధుల్లో డప్పు వాయిద్యాలతో ఊరేగింపు చేశారు. ఉత్సవాలను ఈనెల 18వరకు నిర్వహించి 19న అనుపోత్సవం చేయనున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తుల సౌకర్యార్థం పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోందని అగ్నిగంగమ్మ పూజా కమిటీ సభ్యులు తెలిపారు.

బైకు కారు ఢీ కొని ఇద్దరికి గాయాలు



గాయపడిన త్యప్రసాద్, భార్య జ్యోతి

పార్వతీపురంటౌన్: సీతానగరం మండలంలోని మరిపివలస మలుపు వద్ద బైక్‌ను కారు ఢీ కొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. గురువారం జరిగిన ఈ సంఘటనపై జిల్లా ఆస్పత్రి ఔట్‌పోస్టు ఏఎస్సై నిమ్మకాయల భాస్కరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం పట్టణంలోని బెలగాం అగ్రహారం వీధికి చెందిన పాలంకి సత్యప్రసాద్, భార్య జ్యోతి ద్విచక్ర వాహనంపై విశాఖపట్నం వెళ్తుండగా సీతానగరం మండలం మరిపివలస గ్రామ సమీపంలో మలుపు వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో భార్యాభర్తలకు తీవ్రగాయాలు కాగా గమనించిన స్థానికులు 108 వాహనం ద్వారా జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం నిమిత్తం విశాఖపట్టణం కేజీహెచ్‌కు రిఫర్ చేసినట్లు వైద్యులు తెలిపారు.

నిర్బంధించిన పశువులను కాపాడిన పోలీసులు

కొత్తవలస: మండలంలోని సంతపాలెం గ్రామం శివారు మామిడి తోటలో అక్రమంగా నిర్బంధించిన 171 పశువులను సీఐ సీహెచ్.షణ్ముఖరావు ఆధ్వర్యంలో పోలీసులు గురువారం కాపాడారు. ఆ పశువులను ఇక్కడికి తీసుకొచ్చి వధించి వేరే చోటకు మాంసాన్ని తరలించేందుకు సిద్ధంగా ఉన్నాయని అజ్ఞాత వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా పశువులను అక్రమంగా నిర్బంధించిన ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఆ పశువులను ప్రస్తుతానికి అక్కడే ఉంచామని కోర్టు ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని సీఐ చెప్పారు.

నిద్ర కరువైతే అనారోగ్యం..!



ఓఎస్‌ఏ మిషన్ పెట్టుకుని నిద్రపోతున్న గురక సమస్య ఉన్న వ్యక్తి

ఎక్కువమందికి నిద్రలేమి సమస్య



చాలామంది నిద్రలేమి సమస్య బారిన పడుతున్నారు. **అయితే** ఈసమస్యకు **ఎవరిని** సంప్రదించాలో **చాలామందికి తెలి**యదు. పలమనాలజిస్టునుగాని, ఈఎన్‌టీ వైద్యుడిని గానీ సంప్రదించాలి. ఆరోగ్యంగా జీవించడం కోసం రోజులో 6 నుంచి 7 గంటల పాటు నిద్రపోవాలి. సెల్ ఫోన్ ఎక్కువగా వినియోగించకూడదు. అదేవిధంగా టీవీ కూడా గంటల తరబడి చూడకూడదు.

డాక్టర్ బొత్స సంతోష్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

- పెరుగుతున్న నిద్రలేమి సమస్య
- నిద్రలేమితో బీపీ, సుగర్, గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే ఆస్కారం
- మొబైల్, టీవీలు అతిగా చూడడం వల్ల సమస్య

విజయనగరం ఫోర్ట్: మానవుని జీవనశైలిలో మార్పులు, అధికంగా మొబైల్ వాడడం, టీవీ ఎక్కువగా చూడడం వల్ల అధికశాతం మంది నిద్రలేమి బారిన పడుతున్నారు. ఎక్కువసేపు ఒకే చోట కూర్చుని పనిచేయడం, జంక్‌ఫుడ్స్ ఎక్కువగా తినడం, రాత్రివేళ ఆలస్యంగా నిద్రపోవడం, రాత్రి షిఫ్టుల్లో విధులు నిర్వహించడం వల్ల తగినంత నిద్ర ఉండదు. దీని వల్ల వారు బీపీ, సుగర్, ఊబకాయం, గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్, థైరాయిడ్ వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. శుక్రవారం ప్రపంచ నిద్ర దినోత్సవం సందర్భంగా సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం. చాలా మంది నిద్ర లేకపోతే ఏం జరుగుతుంది? అని తేలికగా తీసుకుంటారు. అర్ధరాత్రి వరకు చాలా మంది నిద్రపోరు. దీని వల్ల అనేక సమస్యల బారిన పడతారు. నిద్రలేమి వల్ల ఓఎస్‌ఏ (అబ్స్ట్రక్టివ్ స్లీప్ అస్నియా) అనే సమస్యకు గురవుతారు. ఈ సమస్య ఉన్న వ్యక్తి శ్వాస తీసుకోవడం పదేపదే ఆగిపోవడం, ఊపిరి లోతుగా తీసుకోవడం (అల్పశ్వాస) జరుగుతుంది. అదే విధంగా పెద్దగా గురక పెట్టడం, శ్వాస పునఃప్రారంభం అయినప్పుడు ఉక్కిరిబిక్కిరి అయి వింత శబ్దాలు రావడం, పగటి సమయంలో మధ్యమధ్య కునుకుపాట్లు పడుతూ ఉండడం, అలసటగాను, మత్తుగాను ఉంటుంది. మద్యం తాగడం, పొగతాగడం, స్థూలకాయం వల్ల ఓఎస్‌ఏ సమస్య తీవ్రతరం అవుతుంది. చిన్నపిల్లల్లో అయితే ఎదుగుదల ఉండదు. మానసిక సమస్యల బారిన పడతారు.నెలకు 1000 మంది వరకు నిద్ర లేమి సమస్య బారిన పడుతున్నారు.



నిద్రలేమి సమస్య ఉన్న వ్యక్తిని పరీక్షిస్తున్న వైద్యుడు

6నుంచి 7 గంటల నిద్ర అవసరం

ప్రతి వ్యక్తి రోజులో 6 నుంచి 7 గంటలు నిద్రపోవాలి. ఇలా నిద్ర పోవడం వల్ల హార్మోన్స్ తయారవుతాయి. ఒత్తిడి తగ్గుతుంది. పనిచేయడానికి అవసరమైన శక్తి తయారవుతుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది. శరీర ఉష్ణోగ్రత నియంత్రణలో ఉంటుంది.

జాగ్రత్తలు

నిద్రలేమి సమస్య బారిన పడకుండా ఉండాలంటే ప్రతిరోజూ వ్యాయమం చేయాలి. కనీసం రోజులో 6 గంటలు నిద్ర పోవాలి. నిద్రలేమి సమస్య ఉన్నట్లయితే పలమనాలజిస్టునుగాని, ఈఎన్‌టీ వైద్యుడిని గాని సంప్రదించాలి. ఊబకాయం రాకుండా చూసుకోవాలి. పానీపూరీ, చాట్, పిజ్జా, బర్గర్లు వంటివి ఎక్కువగా తినకూడదు.

ఆకతాయిల ఆట కట్టించేందుకు 'శక్తి' టీమ్స్



శక్తి టీమ్స్‌కు దిశానిర్దేశం చేస్తున్న ఎస్పీ వకుల్ జిందల్, ఏఎస్పీ సౌమ్యలత

- ఐదు బృందాలుగా 30మందితో టీమ్స్
- ఒక్కో బృందానికి ఒక్కో ఎస్సై నాయకత్వం
- టీమ్స్ పనితీరు చూసేందుకు అదనపు ఎస్పీ నియామకం

విజయనగరం క్రైమ్: ఆకతాయిల ఆట కట్టించేందుకు 'శక్తి ' టీమ్స్‌ను ఏర్పాటు చేశామని ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. జిల్లాలో మహిళలపై జరుగుతున్న దాడులు, ఆకతాయిల వేధింపులను నియంత్రించేందుకు, మహిళలకు రక్షణగా నిలిచే చట్టాలు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'శక్తి' యాప్ పట్ల అవగాహన కార్యక్రమాలు చేపట్టేందుకు శక్తి టీమ్స్‌ను నియమించామని తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేసిన శక్తి టీమ్స్‌తో ఎస్పీ వకుల్ జిందల్ జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం మమేకమై, వారు నిర్వర్తించే విధులు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. ఈ శక్తి టీమ్స్ జిల్లాలోని కళాశాలలు, ముఖ్య కూడళ్లను మఫ్టీలో సందర్శించి, మహిళలను వేధించే ఆకతాయిలను గుర్తించి, వారిపై చట్టపరమైన చర్యలు చేపడతారన్నారు. విజయనగరం, బొబ్బిలి, రాజాంలలో ఆరుగురు పోలీసు సిబ్బందితో ఐదు బృందాలుగా 30మందితో శక్తి టీమ్స్ ఏర్పాటు చేశామని, ఒక్కో బృందానికి ఒక్కో ఎస్సై నాయకత్వం వహిస్తారని చెప్పారు. ఈ బృందాలు మఫ్టీలో విధులు నిర్వహిస్తారని తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన శక్తి టీమ్స్ కోసం గతంలో ప్రత్యేకంగా కేటాయించిన ద్విచక్రవాహనాలను, ఫోర్ వీలర్స్ పెట్రోలింగ్ వాహనాలను వినియోగించాలని సూచించారు. ఆపద సమయంలో శక్తి యాప్‌కు వచ్చే ఎస్ఓఎస్ కాల్స్, డయల్ 112,100 కాల్స్‌ను బట్టి సంఘటన స్థలంకు వెళ్లే వారు తమతోపాటు ట్యాబ్‌లు కూడా వెంట తీసుకుని వెళ్లాలని, బాడీ వోర్న్ కెమెరాలను ధరించాలని సూచించారు. కాల్స్ వచ్చిన వెంటనే శక్తి బృందాలు అప్రమత్తమై సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకుని సమస్యలను చట్టబద్ధంగా పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని ఎస్పీ వకుల్ జిందల్ శక్తి టీమ్స్‌ను ఆదేశించారు.

ప్రజల్లో అవగాహన కల్పించాలి

మహిళలకు రక్షణగా ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన శక్తి మొబైల్ యాప్ పట్ల ప్రజల్లో విస్తృతంగా ప్రచారం కల్పించి, వారి మొబైల్స్‌లో యాప్ నిక్షిప్తం చేయడం, రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. ఆపద సమయాల్లో శక్తి యాప్ ఏవిధంగా పని చేస్తుందన్న విషయాన్ని మహిళలకు వివరించాలని కోరారు. ఈ బృందాల పని తీరును జిల్లాలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత పర్యవేక్షిస్తారని, మహిళా పీఎస్ ఇన్‌స్పెక్టర్ నోడల్ అధికారిగా ఉంటారన్నారు. అంతేకాకుండా, శక్తి టీమ్స్ పని తీరును రాష్ట్ర డీజీపీ కార్యాలయం కూడా పర్యవేక్షిస్తుందని, వారి ఆదేశాల మేరకు చేయాల్సి ఉంటుందని శక్తిటీమ్స్‌కు ఎస్పీ దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, మహిళా పీఎస్ సీఐ ఈ.నర్సింహమూర్తి, ఎస్పీ సీఐ ఏవీ లీలారావు, ఆర్ఐ ఎన్.గోపాల నాయుడు, శక్తి టీమ్స్ సభ్యులు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జనావాసాల మధ్య ఏనుగుల జోన్ వద్దు

సీతానగరం: జనావాసాల మధ్య ఏనుగుల జోన్ వద్దని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని అప్పయ్యపేట, జోగింపేట,గుచ్చిమి రేపటివలస గ్రామాల మధ్య ఉన్న కొండవద్ద గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలో ఏనుగుల జోన్ పెట్టడం అంటే ఏనుగులను ఎక్కడి నుంచి వచ్చాయో అక్కడికి తరలించలేని నిస్సహాయ స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. అప్పయ్యపేట, రేపటివలస సరిహద్దుల్లో ఏనుగుల జోన్ పేరుతో ఫారెస్టు అధికారులు చేపట్టిన కందకాల తవ్వకం పనులను నిలుపుదల చేయాలని కోరారు. జనావాసాల మధ్య ఏనుగుల జోన్ ఏర్పాటు చేస్తే మన్యం జిల్లాలో జనం బతకలేరన్నారు. అధికారుల నిర్ణయాన్ని పునరాలోచన చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు రెడ్డి వేణు, రెడ్డి ఈశ్వరరావు, గవర వెంకటరమణ, ఆర్.రాము, వై.రామారావు, కె.అప్పారావు, వై.రాంబాబు, పరమేశు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గంగు నాయుడు

హాస్టల్స్‌ను పరిశీలించిన స్టేట్ ఫుడ్‌కమిటీ

సీతానగరం: మండలంలోని వసతిగృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన వసతి భోజన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని స్టేట్‌ఫుడ్ కమిటీ సభ్యుడు బి.కాంతారావు అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని జోగింపేట, మరిపివలస వసతి గృహాలను గురువారం ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జోగింపేటలో ఉన్న కేజీబీవీ వసతిగృహంలో సరుకుల నిల్వల రిజిస్టర్, వంటల రుచులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సకాలంలో నాణ్యమైన పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించాలని సూచించారు. పదవతరగతి విద్యార్థులకు జరుగుతున్న విద్యాబోధనను పరిశీలించారు. అనంతరం మరిపివలసలో బాలికల వసతిగృహాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ జి.సూరిదేముడు, ప్రిన్సిపాల్స్ మధుకిశోర్, జొన్నాడ సంధ్య పాల్గొన్నారు.



బీఆర్ అంబేద్కర్ విద్యాలయంలో వంటలను పరిశీలిస్తున్న స్టేట్‌ఫుడ్‌కమిటీ సభ్యుడు బి.కాంతారావు

20 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు

సీతంపేట: మండలంలోని చిన్నగోర అటవీప్రాంతంలో 20 లీటర్ల సారాతో ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్సై వై.అమ్మన్నరావు గురువారం తెలిపారు. సారా తరలిస్తున్నారనే సమాచారం రావడంతో నిఘా వేసి పట్టుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం



స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనువాసులు నాయుడు

చీపురుపల్లి రూరల్(గరివిడి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనువాసుల నాయుడు, చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు అన్నారు. గరివిడిలో శ్రీ చైతన్య పాఠశాల ఆవరణంలో నిర్వహించిన డా.బీఎస్.రావు మెమోరియల్ జోనల్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యావిధానంలో ఉన్నత భవిష్యత్తుకు చదువు ఎంత అవసరమో శారీరక, మానసికంగా ఆరోగ్యంగా ఉండేందుకు, క్రీడల్లో ఉన్నతంగా రాణించేందుకు క్రీడలు కూడా అంతే అవసరమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కానీ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కానీ మంచి భవిష్యత్తు లక్ష్యంగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీచైతన్య ఉత్తరాంధ్ర ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఎంవీ.సురేష్, రీజనల్ ఇన్‌చార్జ్ వి.శ్రీనివాసరావు, రామినాయుడు, కోఆర్డినేటర్‌లు బాలరాజు, వెంకటరమణ, అప్పారావు, మనోరమ, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

ట్రైబల్ పెయింటింగ్ అండ్ ఆర్ట్ కాంపిటీషన్‌లో ప్రతిభ

గుమ్మలక్ష్మీపురం: విశాఖపట్నంలో ఈనెల 12న జరిగిన జన్ జాతీయ గౌరవ దివస్ గిరిజన స్వాభిమాన్ వేడుకలు–2025లో భాగంగా నిర్వహించిన స్టేట్ లెవెల్ ట్రైబల్ పెయింటింగ్ అండ్ ఆర్ట్ కాంపిటీషన్‌లో పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని గిరిజన యువకులు, విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ మేరకు ఈ పోటీల నిర్వహణలో పాల్గొన్న లైజనింగ్ ఆఫీసర్/డ్రాయింగ్ టీచర్ రుగడ శ్రీనివాసరావు గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సీనియర్ విభాగంలో గుమ్మలక్ష్మీపురం మండలంలోని తాడికొండ గ్రామానికి చెందిన మండంగి బాలచంద్రుడు వేసిన ఆర్ట్ ప్రథమ స్థానం పొందిందని తెలిపారు. ఈ నేపథ్యంలో బాలచంద్రుడుకు రూ.10వేల నగదు ప్రోత్సాహంతో పాటు ప్రశంసాపత్రం, షీల్డ్‌ను నిర్వాహకులు అందజేశారన్నారు. అలాగే ద్వితీయ స్థానం పొందిన గుమ్మలక్ష్మీపురం మండలం టిక్కబాయి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థి ఆరిక రాజేష్‌కు రూ.5వేల నగదుతో పాటు ప్రశంసాపత్రం, షీల్డ్‌ను అందజేశారని, ప్రత్యేక బహుమతులను కురుపాంలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు గౌతమ్, అన్వితలకు అందజేశారని పేర్కొన్నారు.



పోటీల్లో గెలుపొంది బహుమతులు అందుకుంటున్న గిరిజన విద్యార్థులు

బడిబయట బడిఈడు పిల్లలు

- భిక్షాటన చేస్తూ జీవనయానం
- తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితులే కారణం
- పట్టించుకోని సంబంధిత అధికారులు





రామభద్రపురం: తల్లితో పాటు భిక్షాటన చేస్తున్న బాలుడు,(ఇన్‌సెట్లో) చౌక్కాపు వీధిలో భిక్షాటన చేస్తున్న బాలుడు

రామభద్రపురం: ఏ దేవుడు ఈ చిన్నారుల మొర ఆలకిస్తాడు? ఏ అధికారి వీరి దీనస్థితిని పట్టించుకుంటాడు? ఏ నాయకుడు ఈ పిల్లలకు అండగా ఉంటాడు? ఇంటి ఆర్థిక పరిస్థితులు సహకరించక.. ఆటపాటలతో మమేకమవుతూ విద్యను అభ్యసించవలసిన వయసులో ఎందరో బడిఈడు పిల్లలు బడి బయట భిక్షాటన చేస్తున్నారు. అలాగే వీధి పిల్లలుగా, బాలకార్మికులుగా మారుతుండడం దురదృష్టకరం. బడిఈడు పిల్లలు బడికి వెళ్లకుండా వీధులలో, ఆలయాల వద్ద భిక్షాటన చేస్తూ కనబడడంతో ప్రభుత్వ పరిరక్షణ ఇంత దీనస్థితితో ఉందా అంటూ పలువురు విమర్శిస్తున్నారు.బాలల పరిరక్షణ గురించి ప్రభుత్వంతో పాటు సంబంధిత అధికారులు కనీసం పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. కొన్ని కుటుంబాలలో ఆర్థిక, సామాజిక పరిస్థితుల కారణంగా కొంతమంది తల్లిదండ్రులే తమ పిల్లల్ని బలవంతంగా బడిమాన్పించి, భిక్షాటన చేయించడం, ఇంటి పనికో, దుకాణాలకో, మెకానిక్ షెడ్డులకో లేదంటే వ్యవసాయపనులకో పంపిస్తూ బాలకార్మికులుగా మారుస్తున్నారు. ఈ పద్ధతిని మార్చి పిల్లలంతా బడికి వెళ్లేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం, బాలల పరిరక్షణ కమిటీ తీసుకోవాల్సి ఉన్నా పట్టించుకోకుండా విద్యాహక్కు చట్టానికి విఘాతం కలిగిస్తున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ ఉంటే పలువురు చిన్నారులు బహిరంగంగా భిక్షాటన ఎందుకు చేస్తారని, బాలల పరిరక్షణ కమిటీ పర్యవేక్షణ కరువైందని పలువురు విమర్శిస్తున్నారు





రామభద్రపురం: ఆటోలో భిక్షాటనకు బయలుదేరిన బడిఈడు పిల్లలు, (ఇన్‌సెట్లో) వేషం మార్చి యాచన చేస్తున్న విద్యార్థి



రామభద్రపురం: శివాలయం వద్ద భిక్షాటన చేస్తున్న చిన్నారులు

రాయితీపై వ్యవసాయ యాంత్రీకరణ ఉపకరణాలు

- జిల్లా వ్యవసాయ అధికారి వి.తారక రామారావు

తెర్లాం: వ్యవసాయ యాంత్రీకరణ ఉపకరణాలు అందించేందుకు జిల్లాకు రూ.2.5కోట్ల రాయితీని ప్రభుత్వం ప్రకటించిందని జిల్లా వ్యవసాయ అధికారి వి.తారక రామారావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన తెర్లాం వచ్చిన సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం 50శాతం రాయితీపై పవర్‌స్ప్రేయర్లు, పవర్ టిల్లర్లు, రోటోవేటర్లు, ట్రాక్టరు పరికరాలు రైతులకు అందించనుందని చెప్పారు. స్ప్రేయర్లకు మాత్రం కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే రాయితీ ఇవ్వనున్నట్లు చెప్పారు. వీటన్నింటికి కలిపి జిల్లాకు రూ.2.5కోట్లు ప్రభుత్వం రాయితీ ప్రకటించిందని తెలిపారు. జిల్లాలోని రైతులు వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు పొందేందుకు ఆయా మండలాల వ్యవసాయ అధికారుల ద్వారా దరఖాస్తులు పంపించాలన్నారు. అర్హులైన రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటా మన్నారు. జిల్లాకు మంజూరైన వ్యవసాయ పరికరాలను మండలాల వారీగా కేటాయింపులు చేశామని తెలిపారు. జిల్లాలోని రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



రైతుసేవా కేంద్రంలో రైతు విశిష్ట సేవా సంఖ్య నమోదు తెలుసుకుంటున్న జిల్లా వ్యవసాయ అధికారి వి.తారక రామారావు

గంగన్నపాడు రైతు సేవా కేంద్రం తనిఖీ

మండలంలోని గంగన్నపాడు గ్రామంలో గల రైతు సేవా కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారి వీటీ రామారావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతు సేవా కేంద్రం ద్వారా జరుగుతున్న రైతు విశిష్ట సేవా సంఖ్య నమోదును పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. జిరాయితీ భూములు ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా రైతు విశిష్ట సేవా సంఖ్యను నమోదు చేయించుకోవాలని సూచించారు. ఆయనతో పాటు మండల వ్యవసాయ అధికారి జి.సునీల్‌కుమార్ ఉన్నారు.

యువకుడిని కాపాడిన పోలీసులు

- ఆత్మహత్యకు పాల్పడతానని సూసైడ్ లెటర్ రాసిన యువకుడు

విజయనగరం క్రైమ్: ఆత్మహత్యకు పాల్పడతానని సూసైడ్ నోట్ రాసిన కేరళ యువకుడు విష్ణు కొయిత్తా పత్తాయా వెస్లీ (21) ఆచూకీని విజయనగరం టౌన్ పోలీసులు కనిపెట్టి డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు సమక్షంలో యువకుడిని బంధువులకు అప్పగించారు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. కేరళ రాష్ట్రంలోని కన్నూరు జిల్లాకు చెందిన విష్ణు కొయిత్తా పత్తాయా వెస్లీ బీఎస్సీ నర్సింగ్ చదివి బెంగళూరులోని ఒక కార్పొరేట్ ఆసుపత్రిలో వర్క్ చేస్తున్నాడు. ఒక యువతితో పరిచయం ఏర్పడి, ప్రేమకు దారితీసింది. ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తడంతో, యువకుడి ఫోన్ నంబర్‌ను సదరు యువతి బ్లాక్ చేసింది. దీంతో మనస్తాపం చెందిన యువకుడు విష్ణు అమ్మాయి ప్రేమను వదులుకోలేక తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నానని, తన మృతదేహాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరంలో ట్రేస్ చేసుకోవాలని సూసైడ్ లెటర్ రాసి, సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. ఈ పోస్టుతో అప్రమత్తమైన విష్ణు బంధువులు, స్నేహితులు సదరు విషయాన్ని నేరుగా విజయనగరం ఎస్పీకి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీంతో ఆ యువకుడి ఆచూకీ కనిపెట్టి, రక్షించే చర్యలు చేపట్టాలని ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించిన మేరకు రంగంలోకి దిగిన వన్ టౌన్ సీఐ శ్రీనివాస్ తన బృందంతో టెక్నాలజీని వినియోగించి విశాఖపట్నం, చీపురుపల్లి, విజయనగరంలలో పలు ప్రాంతాల్లో గాలించి, చివరికి యువకుడి ఆచూకీని విజయనగరం రైల్వేస్టేషన్‌లో మార్చి 11న రాత్రి కనుగొన్నారు. వెంటనే ఆ యువకుడిని విజయనగరం వన్‌టౌన్‌కు తీసుకువచ్చి కౌన్సెలింగ్ నిర్వహించి బంధువులకు సమాచారం ఇచ్చారు. విష్ణు బంధువులు గురువారం రాగానే విజయనగరం డీఎస్పీ ఆఫీస్ లో డీఎస్పీ శ్రీనివాస్ సమక్షంలో అప్పగించారు. సకాలంలో స్పందించి, యువకుడి ఆచూకీ కనిపెట్టి, ఆత్మహత్య ఆలోచనల నుంచి కాపాడిన వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్, సిబ్బందిని డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్‌ను ఎస్పీ వకుల్ అభినందించారు. యువకుడ్ని కాపాడడంలో చొరవ చూపి, సమయానుకూలంగా అధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేసిన ఎస్పీ వకుల్ జిందల్‌కు యువకుడి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టిన యువకుడితో డీఎస్పీ శ్రీనివాస రావు, వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రస్‌డ్	స్కిన్‌లెస్
₹90	₹150	160